# పడగెత్తిన మనిషి

వీధిగుమ్మం తలుపులు తెరచి మళ్ళీ ఓసారి బయటికి చూచింది సావిత్రి.

ఎవరూ కనిపించలేదు. వీధివిండా ఒట్టి చీకటి నల్లగా ఉంది. దూరంగా ఎలక్ట్రిక్ స్తంభపు బల్బు వెలుగుతూ, ఆరిపోతూ కొనఊపిరితో ఉన్న మనిషిలా అవస్థపడుతోంది.

చీకటి....వెలుగు....మళ్ళీ చీకటి...మళ్ళీ వెలుగు. జీవితమంటేనే చీకటి....వెలుగు.

అసలు మొత్తానికే చీకటైన బతుకునేమంటారో...దాన్ని కూడా జీవితమనే అంటారా ? ఫిలమెంట్ రాలిపోతున్న ఆ బల్బు తప్పకుండా ఆరిపోతుందని తనకు తెలుసు.

తనుకూడా అంతే తప్పకుండా తనూ ఓడిపోతుంది ఓ నాడు.

ఓ నాడట... ఓ నాడు....యిప్పుడు తను ఓడిపోక గెలుస్తోందా. నిజానికి తనిప్పుడు ప్రతిరోజూ ఓడిపోవడంకాదు. క్షణక్షణం చస్తోంది.

-ప్చ్... ఆమె మనస్సు తుఫానును మింగుతున్న సముద్రంలా ఐంది. ఆలోచనలు అప్పుడే అంటుకున్న అడివిలా మండుతున్నాయి. అంతా కల్లోలం...కల్లోలం. యీ తన పతనానికి కారకులెవరు...తనూ మాత్రం కాదు. ఆ విషయం తనకు తెలుసు స్పష్టంగా.

అలాంటప్పుడు ఎవరో చేస్తున్న తప్పుకు తను ఎందుకు బలి గావాలి, తన భవిష్యత్తు నెందుకు నాశనం చేసుకోవాలి. ఎందుకీ నరకా న్ననుభవించాలి.

కాని అతను తనకు 'ఎవరో' నా. 'ఎవరో' అయితే యీ తనకథ యిలా ఉండేదే కాదు. '...' నిట్టూర్చింది సావిత్రి. యింతలో రివ్వున గాలి వీచి తలుపు దబాలున తాకింది ఆమె నుదురుకు. చటుక్కున చేతితో ఒత్తుకుని ...ఓ క్షణం కళ్లమూసుకుని....బాణం దిగిన పిచ్చుకలా తల్ల డిల్లి...తేరుకుని అరచేయిని తిప్పి చూచుకుంటే.

మసక వెలుగులో...నల్లగా నెత్తురు. ఎర్రని నెత్తురు కూడా చీకటికి లొంగిపోయి నల్లగా కనబడుతూ—ప్చ...నవ్వుతుంది నిశ్శబ్దంగా.

నుదురుపై నొప్పి సన్నగా మండుకొంది. తలుపులను దగ్గరగా వేసి లోపలికెళ్లి రేకుడబ్బాలోని పసుపుపొడిని రవ్వంత అద్దుకుంది దెబ్బ తగిలినచోట.

దీపం వెలుగులో...చూపుడువేలు పసుపులో రక్తంలోతడిసి— ఎర్రగా—ఉదయిస్తున్న సూర్యుడిని చూస్తున్న పసివానిలా ఫీలయిందామె.

ఏదో ఉత్సాహం ప్రవహించింది నరాల్లోకి గర్జిస్తూ. వంటింట్లో లైటు ఆర్పేసి...ముందు గదిలోకి వచ్చి నేలపై కూలబడి...గోడకు ఒరిగి.

ఎదురుగా...నేలపై చిరిగిపోయిన దుప్పటి పరచుకుని పిల్ల లిద్దరూ వాడిపోయిన పండ్లలా పడుకుని.

వాళ్ళకు ఎన్నడూ ఒంటినిండ బట్టల్లేవు. కడుపునిండ తిండిలేదు, ముద్దూ ముచ్చటా లేవు.

యిక తన సంగతి యింకా అధ్వాన్నం తను మనిషిలా బతకడం మానేసి చాలా రోజులైంది. ప్రాణముండి మనసులేని దానిగా అతనికింద నలిగీ నలిగీ.... యిక అలసిపోయింది తను.

"అసలతను ఏం మనిషి–" "అసలు మనిషేనా అతను–" "మనిషికి కనీసం జంతులక్షణాలైనా ఉండాలిగదా"

ఎన్నోసార్లు చెప్పింది తను. బ్రతిమిలాడుకుంది తను. ఏడ్చింది తను– యీ ఎనిమిదేళ్లనుండి అరిగిన గ్రామఫోన్ రికార్డులా అరిచిఅరిచీ– యింకెన్నాళ్లీపాట.... యిదే పాతపాట.... యిదే పసికిరానిపాట. యీ కన్నీటి పాటల్లోనుండి జీవితాలు చిగురిస్తాయా...ప్చ.... అంతా ఉత్తది.

యీ పాటలవెనుక నిలబడి అతనివెంట నడుస్తూంటే ఏంమిగులుతోంది___తనకు చిరిగిపోయిన చీరల్లో మూటగట్టుకున్న జీవితం...పిల్లలకు తమను బిచ్చగాళ్ల మందలోకి తరుముకుపోతున్న బతుకు___

ఆమె ముఖం దీపం వెలుగులో అప్పుడే విచ్చుకుని రేకులు చించుకున్న కమలంలా కనబడుతోంది. విముక్తి...విముక్తి...ఎన్నడు... ఎప్పుడు ఆ యింటి ప్రక్కనుండి అరుస్తూ పరుగెత్తుకొచ్చింది రైలు బండి...వచ్చి దడదడ గోలచేస్తూ....కిటికీలోనుండి కనబడుతోంది పరుగెత్తుతున్న రైలు.

యింజన్ ... యింజన్ వెంట డబ్బాలు .... యింజన్ వెంటనే డబ్బాలు యింజన్ ఎటులాగితే డబ్బాలు అటు కదలాలి. యింజన్ ఎటు తీసుకుపోతే డబ్బాలు అటు పోవాలి. డబ్బాలకు స్వేచ్ఛలేదు.

యీ వివాహ వ్యవస్థ రైలుబండిలాంటిదేనా, భర్త యింజనైతే భార్య. పిల్లలూ డబ్బాలై వెంట నడవాల్సిందేగాని ఎవరికివారు స్వతంత్రులై ఎదిగేందుకు వీల్లేదా...యింజన్ పాడైతే డబ్బాలు అక్కడే...

ఆ యింజన్‌తోపాటే తుప్పుపట్టిపోవాలా ...ప్చ్.... ఏమిటి ,.. ఏమిటీ గందరగోళం.... ఏమిటి ఘర్షణ—

రైలుబండి వెళ్ళిపోయింది. అంటే ఒంటిగంట దాటిందన్న మాట—నీరసంగా మూల్గింది గాలి లీక్ ఔతున్న రబ్బరు బుడగలా.

ఎదురుగా గదంతా ఖాళీగా అందరిండ్లలోనూ సాధారణంగా ఉండే ఏ సామానూ లేకుండా బోసిగా....గోడలకు సున్నపుగిలాబ్ రాలిపోయి ముఖంమీద పుండ్లుపడ్డ కుష్ఠురోగిలా—తనపై తనకే అసహ్యమేసింది సావిత్రికి.

అందరిలాగే ఉద్యోగం చేసుకుంటూ—అందరిలాగే బ్రతకడం నేర్చుకోని అతని మూలంగా...తామందరూ యిలా వానలో పారేసిన కర్రల్లా చీకిపోతూ—

అతను...అతను...హుఁ....అతని జ్ఞాపకాలు ఆమెను కుమ్మరి పురుగులా తొలుస్తున్నాయి. భర్త .... భరిస్తాడట తనను — తనే భరిస్తోంది అతనితో సంక్రమించిన వరకాన్ని.

బయట వీధి తలుపులు చప్పుడై ....దడదడలాడి,..సా...విత్రీ" అన్న గర్జన వినబడింది.

విశ్శబ్దంగా చూస్తోంది గుమ్మం దిక్కు...తూలుతూ వస్తున్న అతని దిక్కు." సా...వి....త్రీ..." వస్తున్నాడు యింట్లోకి.... దగ్గరకి—వచ్చి ఎదురుగా నిలబడి— "యిక్కడే దయ్యంలా కూర్చుని పలకవేమేముందా— "........"

"ఏయ్....మాటాడు—" "........"

"వెంటనే లేచి సామాన్లుసర్దు. మన మీ ఊరునుండి వెళ్ళిపోవాలి తెల్లారెసరికి" "........"

చెప్తున్నది సిక్కాదూ—లే—" "........." "ఏయ్ బ్రూట్...గెటప్"

సావిత్రి చూస్తోంది తీక్షణంగా...విశ్చలంగా.

అతవి ముఖం దీపం ముందర నూనెరాసిన ఎర్రరాతి తలలా మెరుస్తూ......సారా వాసన నోట్లోనుండి వరదలా ముంచుకొస్తూ—

"లే—" అరిచాడు అసహనంగా "ఎందుకు" అంది విలకడగా.

"మొన్న ఆఫీస్ డబ్బు నా దగ్గరుంటే ఆ డబ్బుతో పేకాడాను. మూడువేలు పోయాయి. ఆఫీస్‌లో ఛార్జిషీటిచ్చారు. యిప్పుడా డబ్బు వర్దలేకా ... యిక్కడ ఉండలేకా నేను నరకాన్ననుభవిస్తున్నాను. అందుకనే వెళ్ళిపోవాలి యిక్కడినుండి. వెంటనే వెళ్ళిపోయి తెల్లారె వరికి వాళ్ల పోలీస్ రిపోర్టిచ్చే లోపలేయిక్కడినుండి తప్పుకోవాలి... పా....వెంటనే పిల్లలను తీసుకొని బయల్దేరు—"

"వ్యసనాలకు అలవాటుపడి డబ్బు పోగొట్టుకున్నవాళ్ళు శిక్షననుభవించాలి కాని ఏ పాపమెరుగవి మేమెందుకు రావాలి నీ దొంగ జీవితంలోకి."

"అలాగా..." "......." సావిత్రి ముఖం మెరుస్తోంది వెలుగులో.

"రావా నువ్విప్పుడు". "యిన్నాళ్ళనుండి నిన్ను మార్చాలని ప్రయత్నించి నా జీవితాన్ని పోగొట్టుకున్నాను. కాని పిల్లల జీవితాలను కూడా నాశనంచేసే అధికారం నాకులేదు.

"అదంతా అనవసరం నాకు వస్తావా రావా చెప్పు టైంలేదు నాకు". "రాను" లేచి విటారుగా విలబడింది తలెత్తుకుని.

"ఇప్పుడు రాకుంటె యిక నీకూ నాకూ తెగిపోయినట్టే—"
"యిక నీకు కనిపించను............" నువ్వు నీ భర్తనే పోగొట్టుకుంటున్నావు—ఆలోచించుకో" "............".

"సావిత్రి...ఆనాడు సావిత్రి త్యాగం చేసి భర్తను దక్కించుకున్నది. నువ్వు యీనాడు చేజేతులా భర్తను వదులుకుంటున్నావు—"
"............"

"చెప్పు. రావా". "రాను". "రావా" "రాను".

అతను వీధిలోకి నడిచివెళ్ళిపోయాడు చీకట్లోకి.

సావిత్రి చీకట్లో వెళ్ళిపోతున్న అతనివంక చూస్తూ నిలబడి నిట్టూర్చి...

వచ్చి నిద్రబోతున్న పిల్లల గురించి ఆలోచిస్తూ ఉండిపోయి—రాత్రి కరిగిపోతూ....

చాలా సేపయింతర్వాత ఎదురుగా కిటికీలోనుండి ఉదయిస్తున్న సూర్యుడు కనిపించాడు సావిత్రికి ఎర్రగా.